

డేటా ఎంట్రీ ఆపరేటర్ తొలగింపు

సీతంపేట: ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎల్.శంకరరావును డిస్మిస్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో కల్పన కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొండ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు నమోదు చేయక పోవడం, సకాలంలో వివరాలు అందజేయకపోడం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం వంటి అంశాలపై ఎన్నికల నిబంధనలు లోబడి విధుల నుంచి తొలగించారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆ స్థానంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించేకు చర్యలు తీసుకుంటున్నారు.

ముత్యాల ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధం



- నేడు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహణ
- ముస్తాబైన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం

పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముత్యాల ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతి సందర్భంగా శనివారం ఈ పోటీలను నిర్వహించనున్నారు. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు అండ్ రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన సహకారంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మహిళలకు ముగ్గుల పోటీలు జరగనున్నాయి. శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ పేలస్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి గెలుచుకున్న వారికి రూ.4 వేలు, తృతీయ బహుమతి పొందిన వారికి రూ.3 వేలు ప్రదానం చేయనున్నారు. జిల్లా స్థాయి రంగవల్లుల పోటీల్లో ప్రథమ బహుమతి గెలిచిన వారు ఈనెల 11న విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుంది.

నిబంధనలు తప్పనిసరి...

ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. ముగ్గును చేతితోనే వేయాలి. జల్లెడ ఉపయోగించేందుకు అనుమతి ఉంటుంది. గొట్టాలు, బద్దలు వంటివి ఉపయోగించి వేస్తే మూడు మార్కులు తీసి వేస్తారు. ముగ్గులో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు. అవి తప్ప ఇతరత్రా వస్తువులను అమర్చకూడదు. ఆసక్తిచూపే మహిళలు నేరుగా పోటీల వద్దకు చేరుకోవచ్చు. పోటీలు అనంతరం న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలిస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గులను ఎంపిక చేస్తారు. అనంతరం విజేతలను ప్రకటించి బహుమతులు అందిస్తారు.



రంగవల్లుల పోటీలకు సిద్ధమైన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం

అదే జోరు.. ఆగని పోరు

- జిల్లాలో అంగన్‌వాడీల నిరసనలు
- 25వ రోజుకు సమ్మె
- సర్కారు తీరుపై మండిపాటు



సాలూరులో మెడకు చీర కొంగులను బిగించుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బెలగాం/సాలూరు/పాలకొండ/సీతానగరం, జనవరి 5: వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని జిల్లాలో అంగన్‌వాడీలు నినదించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా.. సర్కారు స్పందించకపోవడంపై మండిపడ్డారు. శుక్రవారం విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులిచ్చినా.. ఉన్నతాధికారులు ఆదేశించినా.. అంగన్‌వాడీలు జిల్లాలో వినూత్నంగా ఆందోళనలు చేపట్టారు. పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం జగన్ మనసు మార్చుకుని.. గతంలో తమకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 'చర్చల పేరుతో కాలయాపన చేసి, ఇప్పుడేమో విధులకు హాజరవ్వాలని లేకపోతే తీసేస్తాం' అని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నోటీసులు, బెదిరింపులకు జడిసేది లేదని.. సర్కారు దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గౌరీమణి, మర్రాపు అలివేలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు. సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు తమ మెడకు చీర కొంగులను బిగించుకుని వినూత్నంగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ' మేం చావాలా... జగనన్నా... మేం పోవాలా జగనన్నా...' అంటూ నినదించారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే తమ చీరలతోనే ఉరి వేసుకుంటామని తెలిపారు. బలిజిపేటలో ఎండు గడ్డి తింటున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు సాంబమూర్తి వారికి మద్దతు తెలిపి, రూ.2వేలు ఆర్థికం సాయం అందించారు. పాలకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా, కోలాటం ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో టీడీపీ నేత కర్నేన అప్పలనాయుడు, అంగన్‌వాడీల నాయకులు, ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన హెల్పర్

సీతంపేట: సీతంపేట సమ్మె శిబిరంలో కోతాం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ ఎస్.శిరీష తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ తప్పిపడిపోయారు. దీంతో అక్కడే ఉన్న తోటి కార్యకర్తలు వెంటనే ఆమె ముఖంపై నీళ్లు చల్లి సపర్యలు చేశారు. దీంతో శిరీష స్పృహలోకి వచ్చారు. అనంతరం ఆమెను స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు.



హెల్పర్‌కు సపర్యలు చేస్తున్న దృశ్యం



పార్వతీపురంలో...



బలిజిపేటలో..



పాలకొండలో..

సర్కారు బుద్ధి మార్చాలని..

- సరస్వతీదేవికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల పూజ



కలెక్టరేట్ వద్ద సరస్వతీ దేవికి పూజ చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

బెలగాం, జనవరి 5: వైసీపీ ప్రభుత్వం బుద్ధి మార్చాలని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. కలెక్టరేట్ వద్ద శిబిరంలో సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేసి.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'సీఎం జగన్ మనసు మారేలా చూడు తల్లీ' అంటూ వేడుకున్నారు. నోటీసులకు సరైన సమాధానం ఇవ్వలేదనే సాకుతో తమను టెర్మినేట్ చేస్తామని విద్యాశాఖ అధికారులు బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ మొండి వైఖరిని ఖండిస్తూ.. కొంతమంది చలో విజయవాడ వెళ్లారని, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. నోటీసులకు భయపడేది లేదన్నారు. గతంలో సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

సీఆర్‌టీల తొలగింపునకు రంగం సిద్ధం

పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఒకవైపు సమ్మె చేస్తుంటే.. మరో వైపు ప్రభుత్వం వారిని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోంది. జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న 64 మంది సీఆర్‌టీలను తొలగించాలని అధికారులు ఆదేశించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం చర్యలను అనేక ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయి.

లక్ష్యాల సాధనకు అభిలాష

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యార్థులు, నిరుద్యోగులు తమ ఉన్నత లక్ష్యాలను సాధించడానికి 'అభిలాష'ను వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. 53 శాతం అక్షరాస్యతతో జిల్లా బాగా వెనుకబడి ఉందన్నారు. దాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఈ మేరకు నీతి అయోగ్ మంజూరు చేసిన సుమారు రూ.2.35 కోట్లతో 'అభిలాష' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తంగా 200 సచివాలయాల్లో విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్, జనరల్‌నాలెడ్జ్, సబ్జెక్టు పుస్తకాలతో ఐటీడీఏ ద్వారా గ్రంథాలయాలు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. జేఈఈ, నీట్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు, యూపీపీఎస్సీ, ఏపీపీ ఎస్సీ, రక్షణ దళాలు తదితరల పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అవసమైన పుస్తకాలు ఈ లైబ్రరీలో ఉంటాయన్నారు. ప్రస్తుతం 97 సచివాలయాల్లో 'అభిలాష' ప్రారంభించామని చెప్పారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ తదితరులు ఉన్నారు.

పొర్లు దండాలు పెట్టి..

- జిల్లాలో వినూత్నంగా పారిశుధ్య కార్మికుల ఆందోళన



పార్వతీపురంలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ, జనవరి 5 : 'సీఎం జగన్.. నీకో దండం.. మా సమస్యలు పరిష్కరించవయ్యా' అంటూ శుక్రవారం పార్వతీపురంలో మున్సిపల్ కార్మికులు నినదించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. కొద్ది రోజులుగా శాంతియుతంగా ఆందోళనలు చేపడుతున్నా వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సాలూరు, పాలకొండలోనూ సమ్మె శిబిరం వద్ద పారిశుధ్య కార్మికులు పొర్లు దండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. వారికి టీడీపీ నేతలు గంటా సంతోష్‌కుమార్, బాబ్జీనాయుడు, అంపోలు శ్రీనివాస్, సుంకరి అనిల్, మాజీ కౌన్సిల్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికుల పోరాటంలో పోరాటానికి భాగస్వాములవుతామన్నారు. సర్కారు స్పందించకుంటే శనివారం కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించనున్నామని సీఐటీయూ నాయకులు తెలిపారు.



సాలూరులో ..

ఈ సారీ అంతేనా?

- శంబర జాతరకు సమీపిస్తున్న సమయం
- రాష్ట్రస్థాయిలో గుర్తించినా అభివృద్ధికి నోచుకోని వైనం
- ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్
- ఈ ఏడాదీ భక్తులకు తప్పని ఇబ్బందులు

మక్కువ, జనవరి 5: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ తల్లి జాతరకు సమయం దగ్గర పడుతోంది. సంక్రాంతి పండగ తర్వాత వారంలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తజనం తరలిరానున్నారు. అయితే ఏటాలానే ఈ సారి కూడా వారికి పాత సమస్యలే స్వాగతం పలకనున్నాయి. రాష్ట్ర జాతరగా గుర్తింపు పొందినా కనీస సౌకర్యాలు, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శంబరలో ఈనెల 22, 23, 24 తేదీల్లో పోలమంబ జాతర నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి లక్షలాదిమంది భక్తులు తరలిరానున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 10 వారాల పాటు ఇక్కడ జాతర జరుగుతుంది. అయితే జాతరకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు ఏటా విఫలమవుతున్నారు. ఆలయ అధికారులు ఏటా తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టి, జాతర పూర్తయ్యాక పక్కా ప్రణాళికలు వేసే పనిలో పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. కానీ శాశ్వత పరిష్కారానికి సంబంధించిన ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ ఏడాదైనా పరిస్థితులు మెరుగవుతాయనే ఆశతో వచ్చే భక్తులకు నిరాశే మిగులుతోంది. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా... అభివృద్ధి పనులు, సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రధాన సమస్యలివీ...

పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం రోజునే రెండు లక్షల మందికి పైగా భక్తులు శంబర గ్రామానికి తరలివస్తారు. అయితే భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి కనీసం షెడ్లు కూడా లేవు. దీంతో చెట్ల కింద సేదతీరాల్సి వస్తోంది. తాగునీరు, వసతి, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనంగుడి చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అధికారులు చెప్పినా, ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. చదురుగుడి, వనంగుడి అభివృద్ధికి ఏటా ప్రతిపాదనలు, ప్రణాళికలు తయారుచేస్తున్నప్పటికీ.. అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి.

విస్తరణకు నోచుకోని చదురుగుడి..

శంబరలో పోలమాంబ చదురుగుడి జనావాసాల మధ్య సన్నని రోడ్డులో ఉంది. దీంతో భారీగా భక్తులు తరలివచ్చే సమయంలో తొక్కిసలాటలు, తోపులాటలు సర్వసాధారణంగా మారాయి. అయితే చదురుగుడి ఆలయానికి ఇరువైపులా ఉన్న గృహాలను కొనుగోలు చేసి ఆలయాన్ని విస్తరించాలని గతంలో దేవదాయశాఖ అధికారులు ప్రతిపాదించారు. గృహాల యజమానులు కూడా వాటిని అమ్మేందుకు ముందుకు వచ్చారు. అయినా సరే విస్తరణ కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. మరోవైపు ఏటా తాత్కాలిక ఏర్పాట్ల పేరిట లక్షలాది రూపాయలు వెచ్చించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మక్కువ ప్రధాన రహదారి ఇలా..

అధ్వానంగా రోడ్లు..

మక్కువ - చినబోగిలి, మక్కువ - సాలూరు రహదారులు అధ్వానంగా మారాయి. దారి పొడవునా భారీ గొయ్యిలు ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతర సమయంలో ఈ మార్గాల్లో వాహనాల రద్దీ మరింత పెరగనుంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా రహదారుల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రాళ్లు తేలి, గోతులమయంగా మారిన రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మక్కువ ప్రధాన రహదారి అయితే ఇక చెప్పనక్కరలేదు. కనీసం రోడ్లపై గోతులు పూడ్చి రాకపోకలకు కొంత వెసులుబాటు కల్పించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



శంబరలో పోలమాంబ చదురుగుడి

ఉన్నతాధికారులకు నివేదిస్తా..

నూతనంగా బాధ్యతలు స్వీకరించా. సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకుని అందరి సహకారంతో శంబరలో పోలమాంబ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. ఇక్కడ సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

-వీవీ సూర్యనారాయణ, ఈవో

వందరోజుల్లో కష్టాలకు చెక్

- చంద్రన్న సూపర్ సిక్స్‌తో సంక్షేమం, అభివృద్ధి ఒకే చోట
- 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నాయకులు


విజయనగరం: ప్రజలకు పథకాలను వివరిస్తున్న అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు


సీతంపేటలో..


బాడంగి: ఎరుకలపాకలులో..

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 5 : మరో వందరోజుల్లో ప్రభుత్వం ఏర్పడుతుంది, జగన్ అనే గ్రహణం వీడి, చంద్రన్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో ఒకేచోట అభివృద్ధి-సంక్షేమం ఖాయమని విజయనగరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి అదితి గజపతిరాజు అన్నారు. బాబు ష్యూ రిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 6వ డివిజన్ జమ్ము అంజనేయ స్వామి అలయం నుంచి, స్థానిక టీడీపీ నేతలతో కలసి ప్రచారం చేశారు. విజయనగరం నియోజకవర్గం డివిజన్ టీడీపీ నేతలు, జన సేన నాయకులు యశస్విని, ఐవీపీ రాజు, పూసపాటి రాజేష్ వర్మ, ప్రసాదుల వరప్రసాద్, కనకల మురళీమెహన్, బొద్దల నర్సింగ్‌రావు, గంటా రవి, పోలి నాయుడు, రౌతు పద్మా, ఆల్తి బంగారునాయుడు, కర్రోతునర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ● అనంతరం 15వ డివిజన్‌కు చెందిన సురేష్‌కుమార్, అశ్విని ఆధ్వర్యంలో ప్రేమసమాజంలోని వృద్ధులకు ఆదితి గజపతిరాజు దుస్తులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎరుకుల పాకల గ్రామంలో గజరాయనివలస ఎంపీటీసీ, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన అనుచరులతో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మినీ మేనిఫెస్టోను వివరించారు.

సీతంపేట: ఓట్లేసి గెలిపించినందుకు రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని టీడీపీ పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. శుక్రవారం కోడిశ పంచాయతీ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివేకాను హత్య చేసిన నేరస్థులను జగన్మోహన్‌రెడ్డి కాపాడుతున్నారని, అన్నమయ్య డ్యామ్ బాధితులను నట్టేట ముంచారని ఆయన ఆరోపించారు. సవర తోట ముఖలింగం, నిమ్మక నాగేశ్వరరావు, సవర గంగయ్య, నిమ్మక చంద్రశేఖర్, ఆర్.రంగనాథం, బిడ్డిక నీలయ్య, హిమరిక పవన్, తోయక సంధ్యారాణి పాల్గొన్నారు.

రేపు బీసీ సామాజిక చైతన్య సభ

విజయనగరం దాసన్నపేట: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 7న జరిగే బీసీ సామాజిక చైతన్య సభను విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మూలభూషణ్ అప్పారావు దొర, గొలగాని రమేష్ యాదవ్, గుంటుబోయిన కూర్మారావు, గిడిజాల ఆదినారాయణ, వానపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కొత్తవలస: అర్హులైన 26 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందని జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండంలోని రామలింగాపురంలె కొత్తగా మంజూరు చేసిన వివిధ రకాల పింఛన్లను ఆమె చేతులు మీదుగా అందజేశారు.

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో శుక్రవారం రూ. 3వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ నగదు పంపిణీ కార్య క్రమం నిర్వహించారు. జడ్పీచైర్మన్, ఎంఎల్‌సి, నియోజకవర్గం ఇన్‌చార్జ్‌లు ప్రభుత్వసంక్షేమం, అభివృద్ధి పథకాలు వివరిస్తూ జగన్ సర్కారును మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: స్థానికంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎస్.యు.ఐ. రాష్ట్ర కార్యదర్శి సన్యాసిపాత్రుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈఓ-2కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలను నిర్వహించకూడదన్న నిబంధనను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం రింగురోడ్డు: నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం మేయర్ వీవీ లక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 28 అంశాలు పొందు పరిచారు. వాటిలో ఒక్క అంశాన్ని మినహా, మిగతా 27 అంశాలకు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. టెండర్ల ప్రక్రియ ఖరారైన వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చొరవ చూపాలని ఆమె చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో పూర్తి పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనేల శివదనలక్ష్మి, పిన్నింటి కళావతి, కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేంద్ర మంత్రి

కలెక్టరేట్: కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుని మత్స్యకారులతో మంత్రి మాట్లాడతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం అమలు చేస్తున్న పి.ఎం.మత్స్య వందన యోజన తదితర పథకాల అమలు తీరును తెలుసుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో 1,820 మందికి రూ.2.62 కోట్లు

కలెక్టరేట్: జిల్లాలో వివిధ పథకాలకు అర్హులై... మిగిలిపోయిన 1820 మంది లబ్ధిదారులు రూ 2.62 కోట్ల లబ్ధి పొందారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సీఎం జగన్ తాడేపల్లి నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు హాజరయ్యారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జి.శశిభూషణరావు అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. కొద్దికాలంగా సెలవులో ఉన్న సివిల్ సర్జన్ డాక్టర్ జి.రామ్‌నరేశ్ మళ్లీ ఇక్కడ బాధ్యతలను స్వీకరించడంతో ఆయనను ఎమ్మెల్యే శంబంగికి, ఇతర సభ్యులకు పరిచయం చేశారు. ఆసుపత్రిలో ఫర్నీచరు, ఇతర సామగ్రిని సమకూర్చేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వైద్యులు, సిబ్బంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిసిని చంద్రమోహన్‌కు అభినందనలు

రాజాం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులుగా నియమితులైన పిసిని చంద్రమోహన్‌కు రాజాం నియోజకవర్గ నాయకులు పి.రాజు తదితరులు శుక్రవారం అభినందనలు తెలిపారు. చంద్రమోహన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అధినేత పవన్ కల్యాణ్ ఆశయ సాధనే ధ్యేయంగా పని చేయాలన్నారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల నాయకులు గొర్లె గోవిందరావు, ఎన్ని సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

విజయనగరం రింగురోడ్డు: జిల్లా కోర్టు వద్ద ఉన్న ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో ఆర్టీసీ వాహనాలే కాకుండా 'జనతా గ్యారేజ్' పేరిట ఇతర ప్రైవేటు వాహనాల పనులను, అన్ని రకాల కోచ్ వర్క్ పనులు, బాడీ మరమ్మతులు, వాహనాల సాధారణ సర్వీసింగ్, పెయింటింగ్ వర్క్స్ చేయనున్నట్టు ఆర్టీసీ వర్క్స్ మేనేజర్ జి.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిటింగ్, ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్‌కు అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధికి సంబంధించిన పనులు నేర్పుతామన్నారు. ప్రైవేటు స్కూల్ బస్సులకు ఆర్టీసీ టైర్లు సరసమైన ధరలకు అమ్ముతామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25516, 99592 25522, 73829 15578 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైసీపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు దూరం


మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, జనవరి 5: ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజా వ్యతిరేకత పెరుగుతుండడంతో వైసీపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్‌బై చెబుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. వైనాట్ 175 అన్న సీఎం జగన్ ఎన్నికల ముందే ఎమ్మెల్యేలను మారుస్తుండడం చూస్తుంటే ఓటమి భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేయిస్తున్న జగన్ తన పనితీరుపై సర్వేలు చేయించుకుంటే ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌ను మార్చడానికి సిద్ధంగా వున్నారన్నారు. చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవితవ్యంపై ఆందోళన చెందుతున్నారన్నారు. 30 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓటమి భయంతో పోటీకి దూరంగా ఉండాలని చూస్తున్నారన్నారు. మరో 50 మంది పార్టీ మారే యోచనలో ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం తలపాగా తయారీకి శ్రీకారం


పాగా నేతకు సిద్ధమవుతున్నదృశ్యం

రాజాం, జనవరి 5: శ్రీశైలం తల పాగా తయారీకి పెనుబాక ఆంజనేయపురం గ్రామస్థులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలి రోజు వీధిలో సరికట్టి పని ప్రారంభించారు. బొమ్మాన సూర్యారావు, బొమ్మాన వీర్రాజు దంపతులు ఈ మహాక్రతువుకు ముందుకు నడవగా.. స్థానికులు భాగస్వాములయ్యారు. శ్రీశైలం శివరాత్రి మహోత్సవాలకు పాగా తయారు చేసి తీసుకు వెళ్లడం పెనుబాక గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం కూడా భారీ పాగాను తయారు చేయడానికి సంకల్పించారు. దీనికి 25 రోజుల సమయం పడుతుందని తెలిపారు. పాగా సిద్ధమయ్యాక గ్రామంలో ఊరేగించి.. పూజలు చేసి శ్రీశైలం తీసుకు వెళతారు. పాగా తయారీలో తూతిక వీర్రాజు, ముప్పన శ్రీనివాసరావు, ముప్పన అన్నాజీరావు, వట్టి పుష్పవతి, ఆశపు రమణమ్మ తదితరులు సహకారం అందిస్తున్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ


సంకిలి రామాలయంలో భక్తులకు అయోధ్య అక్షింతలు పంచిపెడుతున్న దృశ్యం

రేగిడి, జనవరి 5: శ్రీరామ మందిరం ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను రామాలయ కమిటీ సభ్యులు భక్తులకు పంపిణీ చేస్తున్నారు. బూరాడ, చిన్నయ్యపేట, సంకిలి తదితర గ్రామాల్లో రేగిడి మండల సమరసత సేవా ఫౌండేషన్, కొర్లవలస ఎండల మల్లికార్జున ఆలయ కమిటీ వ్యవస్థాపకులు శివస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం వీటిని అందజేశారు. సంకిలి శ్రీరామ ఆలయంలో అర్చకుడు సీతారామస్వామి అక్షింతలకు పూజలు చేసి... ఇంటింటికీ పంపిణీ చేసినట్లు నారు జనార్దనరావు తెలిపారు. ఈ పంపిణీలో బూరాడ గ్రామపెద్దలు శీర కాశీబాబు, శీర సాయి, శిరిపురపు సత్యం, జడాడ సంతోష్‌శర్మ, సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా మిల్లర్ల దోపిడీ


విలేఖర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బాడంగి: ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లు.. అవి బాగా లేవనే సాకుతో వసూలుకు పాల్పడుతున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఆరోపించారు. ముగడ రైతుల నుంచి రూ.3వేల చొప్పున తీసుకున్నట్టు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ డొంకినవలస రైల్వే స్టేషన్‌లో ఉన్న లక్ష్మీనారాయణ రైసుమిల్లులో ముగడకు చెందిన తెంటు సింహాచలం, జోగినాయుడు, తీళ్ల సత్యనారాయణలకు చెందిన ధాన్యం బాగాలేవనే సాకుతో యజమాని ఉప్పల హరిబాబు బిల్లులో రూ.3 వేలు తగ్గించారన్నారు. నిన్న పినపెంకిలో అమ్మలు రైసుమిల్లు, నేడు డొంకినవలసలో లక్ష్మీనారాయణ మిల్లు యజమానులు రైతులకు ఇబ్బంది కలిగించడం ఎంతవరకు సమంజసమని టీడీపీ వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు ప్రశ్నించారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం

- నాయకులే ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తూ అందజేత

లక్కవరపుకోట: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లు సమయానికి ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 5వ తేదీ ముగిసినా పింఛన్లు పూర్తిస్థాయిలో అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పింఛన్లు పూర్తిగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం వద్ద సొమ్ములేక పింఛను పెంచామనే సాకుతో అరకొరగా పంపిణీ చేస్తున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తూ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నేతల ఇంటికి వెళ్లి పింఛను తీసుకోవాలని వలంటీర్లు ప్రజలను ఒత్తిడికి గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎంపీడీవోను వివరణ కోరగా మొత్తం 31 పంచాయతీల్లో 8842 మందికి పింఛన్లు అందిస్తున్నామని, ఇందులో 4453 మందికి వృద్ధాప్య, 2068 మందికి వితంతు, 1113 మందికి వికలాంగుల పింఛన్లు ఉన్నాయని ఎంపీడీవో రూపేష్ తెలిపారు. ఈ నెల 8లోగా ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేయాలన్నారు. ఎవరింటికి ప్రజలు వెళ్లాల్సిన పనిలేదన్నారు.

భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు


భువనేశ్వరితో మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనను విజయవంతంగా ముగించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆమెకు వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి, పాయకరావుపేట టీడీపీ ఇన్‌చార్జి అనిత ఉన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

- మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు


మాట్లాడుతున్న సుజయ్ కృష్ణ

బొబ్బిలి, జనవరి 5: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరడంపై ఆయన స్పందించారు. వైసీపీని జగన్మోహన్‌రెడ్డి స్థాపించినప్పటికీ ఆ పార్టీ బలమైన శక్తిగా తయారు కావడానికి వైఎస్ తనయ షర్మిలే ప్రధాన కారణమని అన్నారు. స్థానిక కోటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. షర్మిల పాదయాత్ర చేసి ఉండకపోతే జగన్ జైలులో ఉంటూ పార్టీని నడిపే పరిస్థితి ఉండేది కాదని, పాదయాత్రలో ఆమెను ప్రజలు ఆదరించడంతో గుర్తింపు లభించిందన్నారు. వైసీపీ శ్రేణులు జగన్మోహన్ రెడ్డి వైపు ఉంటారా? లేక తన భుజస్కంధాలపై పార్టీని మోసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరిన షర్మిల వైపు మొగ్గు చూపుతారా? అని రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అన్నారు. సీఎం హోదాలో ఉన్న వైఎస్ జగన్‌కు సంబంధించిన అనేక అంశాలు రాష్ట్ర ప్రజానీకానికి తెలియాల్సి ఉందన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుతో పాటు ఇతర ముఖ్యమైన అంశాలన్నిటినీ ప్రజలకు తెలియపరచడం ద్వారా షర్మిల నుంచి స్పష్టత లభిస్తుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. టీడీ పీ నాయకులు రౌతు రామ్మూర్తి, రాంబార్కి శరత్‌బాబు, కర్రోతు తిరుపతిరావు, ఏగి రెడ్డి శ్రీధర్, తాతబాబు, కాకల వెంకటరావు, సుంకరి సాయిరమేష్, నాగరాజు పాల్గొన్నారు.

జిందాల్‌లో స్థానిక యువతకు ఉద్యోగాలివ్వాలి

- ఎమ్మెల్సీ రఘురాజు ఆధ్వర్యంలో నిర్వాసితుల సమావేశం
- మంత్రి, కంపెనీ ప్రతినిధులతో చర్చిద్దామన్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జనవరి 5: త్వరలో జిందాల్ భూముల్లో ఏర్పాటు కాబోయే ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో ముందుగా స్థానిక యువతకు.. 15 ఏళ్ల క్రితం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ బొడ్డవర గ్రామంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో నిర్వాసితులు సమావేశమయ్యారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో రఘురాజు మాట్లాడుతూ 2008లో బాక్సైట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు భూములు ఇచ్చారన్నారు. 1160 ఎకరాలు ఇచ్చి 15 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఎటువంటి పరిశ్రమ రాక రైతులు నిర్వాసితులుగా ఉండిపోయారన్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు జిందాల్‌తో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ పరిశ్రమలు ఏర్పాటు కాక ముందే నిర్వాసితులు, స్థానిక యువతతో కంపెనీ ప్రతినిధులు, మంత్రి బొత్స ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలని కోరుతామన్నారు. గతంలో భూములు ఇచ్చిన రైతులు వృద్ధులు అయిపోయారని, కంపెనీ ఇస్తామన్న ఆర్‌ఆర్ ప్యాకేజీ పూర్తిగా అమలు కాలేదన్నారు. ఇంకా 155 ఎకరాలకు సంబంధించి రైతులకు పరిశ్రమ డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ తరుణంలో నూతన పరిశ్రమలో నిర్వాసితుల పిల్లలకు పూర్తి స్థాయి ఉపాధి.. ఉద్యోగాలు కల్పించాలన్న నినాదంతో ముందుగా సాగుదామని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. కంపెనీ ఏర్పాటు సమయంలో ప్రజాభిప్రాయ సేకరణలో భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరు షేర్ హోల్డర్లని తెలియజేసిందన్నారు. అప్పుడు షేర్ విలువ రూ.10గా ప్రకటించిందని గుర్తు చేశారు. 15ఏళ్ల తరువాత ఈ ధర మరింత పెరుగుతుందన్నారు. కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలన్న అంశాన్ని మంత్రికి వివరిస్తామన్నారు. ఎంపీపీ ఒంటి అప్పారావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, కిల్తంపాలెం, బొడ్డవర, ముషిడిపల్లి, పెదఖండేపల్లి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, జిందాల్ నిర్వాసిత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణ

- అద్దె కోసం చేపల పెంపకానికి..


చేపలచెరువుగా మారిన సరపు బంద

శృంగవరపుకోట రూరల్, జనవరి 5: ధర్మవరం గ్రామంలోని సర్వే నెంబర్ 78-6లో 3.33 ఎకరాలలో ఉన్న సరపుబందను కొందరు ఆక్రమించి విశాఖ జిల్లాలోని కొందరికి చేపల చెరువులుగా అద్దెకు ఇచ్చి ప్రజాధనం దోచుకుంటున్నారని ఆయకట్టు రైతులు భానోజీరావు, అల్లు శ్రీను తదితరులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ చెరువును ఆక్రమించి దీనిపై రూ.3 లక్షలు అడ్వాన్స్ తీసుకొని ఏడాదికి రూ.15వేలు అద్దె వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్ 'స్పందన'లో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై రెవెన్యూ శాఖను చర్యలు తీసుకోవాలని కోరితే ఇది తమ పరిధిలో లేదని... గ్రామ పంచాయతీ, మత్స్యశాఖ వద్ద పరిష్కరించుకోవాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ ఈవో రంగారావును వివరణ కోరగా.. ఇంకా తమకు ఎటువంటి సమచారం రాలేదని... వచ్చిన వెంటనే పరిశీలిస్తామని తెలిపారు. ఇదే విషయంపై వీఆర్వో బోని సత్యనారాయణ మాట్లాడుతూ 'స్పందన' ఫిర్యాదుపై విచారణ చేపట్టి.. తహశీల్దార్‌కు నివేదిక ఇచ్చామని తెలిపారు. చెరువులో చేపల పెంచుతున్నారని... హద్దులు మార్చినట్టు గుర్తించామన్నారు.

కార్మికుల పొర్లు దండాలు

నిరసన తెలిపిన మున్సిపల్ వర్కర్లు


రాజాంలో పొర్లుదండాలతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కార్మికులు


బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం ఎదుట పొర్లు దండాలు పెడుతున్న కార్మికులు

రాజాం రూరల్, జనవరి 5: జగన్మోహన్ రెడ్డి గారూ... మీకు శతకోటి వందనాలు. నిరుపేద కార్మికులపై మీరు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం సమంజసమా అంటూ నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రధాన రహదారిపై మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం పొర్లుదండాలు పెడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు నాయకత్వంలో కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు.

వాటర్ ట్యాంకుపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

వేపాడ, జనవరి 5: మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన చెల్లిబోను ఈశ్వరరావు (45) వాటర్ ట్యాంకుపై నుంచి దూకి శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నట్టు వల్లంపూడి ఏఎస్‌ఐ రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2వ తేదీన ఈశ్వరరావు తన భార్య గంగతో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. దీంతో గాయపడిన గంగను విశాఖ కేజీహెచ్‌కి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త ఈశ్వరరావుపై ఈ నెల 3న కేసు నమోదు చేశారు. కేసుపెట్టారనే అవమానంతో రెండు రోజుల కిందట స్థానిక బావిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా గ్రామస్థుల సాయంతో బయటకు వచ్చాడని ఏఎస్‌ఐ తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామంలోని వాటర్ ట్యాంకుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మృతునికి బాబు, పాప ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ధర్మపురి గ్రామానికి చెందిన ఎస్ బంగార్రాజు (35) శుక్రవారం వ్యక్తిగత పనుల నిమిత్తం నాతవలస వైపు వచ్చి తిరిగి విజయనగరం వైపు ద్విచక్రవాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని పినతాడివాడ జంక్షన్ సమీపంలో విజయనగరం వైపు నుంచి నాతవలస వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బంగార్రాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డెంకాడ ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

రామభద్రపురంలో వృద్ధుడు..

రామభద్రపురం: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పూడివారి కళ్లాల వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రామభద్రపురం గ్రామానికి చెందిన పూడి సన్యాసినాయుడు(60) తన కళ్లం నుంచి ఇంటికి వస్తుండగా మిర్తివలస గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌తో వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సన్యాసి నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ నారాయణరావు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి, 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు వల్లంపూడి ఏఎస్‌ఐ బి.వి.రమణ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ రమణ తెలిపారు.

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా రాము అనే వ్యక్తిని శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. పాతబొబ్బిలి రోడ్డులో టీబీఆర్ థియేటర్ దగ్గర గల ప్రభుత్వ మద్యం షాపు నుంచి బైకుపై రెండు బ్యాగులతో అక్రమంగా మద్యాన్ని కారాడకు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ వ్యక్తిని వెంబడించి పట్టుకున్నారు. 189 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. 26 550 ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యాన్ని, బైకును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ భాగ్యం తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేగిడి: మండలంలోని పర్లి గ్రామసమీపంలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేస్తుండగా గ్రామశివార్లో నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు. కానిస్టేబుల్స్ సుధీర్, శివ ఉన్నారు.

రాజాం రూరల్: మండల పరిధిలోని శ్యాంపురం, గడిముడిదాం గ్రామాల రహదారుల్లో శుక్రవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. శ్యాంపురం వెళ్లే మార్గంలో 180 ఎం.ఎల్. బాటిళ్లు 21, గడిముడిదాం రోడ్‌లో 180 ఎం.ఎల్. బాటిళ్లు 23 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూదరుల అరెస్ట్

రాజాం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కేర్ హాస్పిటల్ రోడ్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.65,410 స్వాధీనం చేసుకున్నట్లు రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సంతకవిటి స్పెషల్ బ్రాంచి పోలీసుల సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని, ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బైకు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని పాతబస్టాండు ఆంజనేయస్వామి గుడిదగ్గర శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలైంది. స్థానిక కొత్తఎరుకలి వీధికి చెందిన ఈశ్వరమ్మ స్టేట్‌బ్యాంకుకు నడిచి వెళుతుండగా ఎదురుగా బైకుపై వస్తున్న ఏవీ బసవన్న ఆమెను ఢీకొన్నాడు. గాయపడ్డ మహిళను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జి.భాస్కరరావు తెలిపారు.

ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీకి రావట్లే!

ఇన్‌చార్జి మార్పుతో సభలకు జోగులు దూరం

రేగిడి, జనవరి 5: స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులును వైసీపీ అధిష్ఠానం రాజాం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించింది. పాయకరావుపేటకు పంపిస్తోంది. ఆయన స్థానంలో తలే రాజేష్‌ను ఇక్కడ నియమించిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జి బాధ్యల నుంచి తప్పించినా జోగులు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల పింఛను కానుకపంపిణీ సమావేశాలను క్యాడర్, మండల స్థాయి యంత్రాంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్నారు. దీనికి చుట్టు పక్కల గ్రామాల డ్వాక్రా మహిళలు, సామాన్య ప్రజలను ఆటోలు, ఇతర వాహనాలతో తరలిస్తున్నారు. జనసంఖ్య బాగానే కనిపిస్తున్నారు. ఈ క్రమంలో తొలిరోజు వంగర మండల సమావేశం... శుక్రవారం రేగిడి మండలం అంబఖండిలో జరిగిన వైఎస్సార్ పింఛను కానుక బహిరంగ సమావేశంలోనూ జోగులు కనిపించలేదు. ఆయన పాయకరావుపేటలో పింఛన్ల పంపిణీకి హాజరవుతున్నట్లు నేతలు చెబుతున్నారు. కారణం ఏదైనా ... ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి సభకు దూరంగా ఉండటం పెద్ద చర్చకు దారి తీస్తోంది. ఎమ్మెల్యే ఎక్కడ అన్న ప్రశ్నలు ప్రజల నుంచి ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యేగా జోగులు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ముగ్గుల పోటీలు





బొబ్బిలి, జనవరి 5: స్థానిక సింగారపువీధి శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు.

అధిక బరువుతో వాహనాలు

- హడలిపోతున్న జనం


పాలకొండ- రాజాం రూట్లో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న చెరకు ట్రాక్టర్

రేగిడి, జనవరి 1: పాలకొండ-రాజాం రోడ్డు అసలే బాగోలేదు. ఆపై భారీ వాహనాలు, ఓవర్ లోడ్‌తో వెళ్లే చెరకు వాహనాలు ఈ ప్రాంతీయులకు భీతి పుట్టిస్తున్నాయి. ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదాలు సంభవిస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారుల జాడ లేకపోవటం వాహనదారులకు కలసి వస్తోంది. ప్రధానంగా మన్యం జిల్లాలో పారాది వంతెన పాడవడం, భారీ లారీలు ఇదే రూట్‌లో అధిక లోడుతో ప్రయాణించడం ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేటు చెక్కర కర్మాగారం క్రషింగ్ సీజన్ కావటంతో భారీ లోడులతో చెరకు వాహనాలు ప్రయాణిస్తున్నాయి. వీటితో ఏ ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రయాణికులు హడలిపోతున్నారు. వీటిని నియంత్రించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి


భోగాపురం: అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజు


గజపతినగరం: సోది చెబుతూ ..

- 25వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె
- శిబిరాల వద్ద వినూత్నంగా నిరసన
- మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూనియన్ నాయకుడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శుక్రవారంతో 25వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన చేపడుతున్నారు. కనీస వేతనం అమలు చేయాలని కోరారు. తమ పట్ల కక్ష ధోరణి తగదన్నారు. పలుచోట్ల అంగన్‌వాడీలకు టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. శిబిరాల వద్దకు చేరుకుని, వారితో పాటు సమ్మెలో పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


కొమరాడ: మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకురాలు లావణ్యలత


గరుగుబిల్లి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


రాజాం: శిబిరంలో పొర్లు దండాలు పెడుతున్న దృశ్యం


రామభద్రపురం: పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు


కొత్తవలస: నినాదాలు చేస్తున్న అంగన్ వాడీలు


బొబ్బిలి: సంఘీభావం తెలుపుతున్న సుజయ్‌కృష్ణ రంగారావు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి


శిక్షణలో మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని యూనిట్-13లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బూత్ ఇన్‌చార్జిలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కురుపాం నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. బూత్ ఇన్‌చార్జిలు కామేశ్వరరావు, రామారావు, గుంజన్న, కొండలరావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం


పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకా లను వేయించ డంతో పాటు ఈ వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఉరి టి రామారావు అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని మరుపెంట గ్రామంలో ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు బి.గణప తిరావు, మండల పశు సంవర్ధకశాఖ అధికారి ఎన్.సురేష్‌కుమార్‌తో పాటు జూని యర్ వెటర్నరీ అధికారి శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

పాలకొండ: నగర పంచాయతీలో గత 11 రోజులుగా మున్సిపల్ కార్మికులు వారి హక్కుల సాధనకు చేస్తున్న సమ్మె కారణంగా పాలకొండలో విపరీతంగా చెత్త పేరుకుపోయిందని 20వ వార్డు కౌన్సిలర్ గంటా సంతోష్‌కుమార్, సుంకరి అనీల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును శుక్రవారం కలిసి, మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్ కార్మికులతో ప్రణాళికాబద్ధంగా శానిటేషన్ నిర్వహించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు వేయాలి


బిల్లమానుగూడలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

జియ్యమ్మవలస: మండలంలోని గిరిజన గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు వేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోరంగి సీతారాం డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 9న స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బిల్లమానుగూడ గిరిజన గ్రామంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనజ గ్రామానికి బిల్లమానుగూడ రెండు కిలో మీటర్ల దూరం ఉన్నప్పటికీ ఇంతవరకు రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. బీటీ రోడ్డు మంజూరు చేసి వెంటనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహనరావు, గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో కొండశిఖర గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదని, ఈ సమస్యలపై ఈనెల 8న భద్రగిరి ఐటీడీఏ డీఈ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురం గిరిజన సంఘం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలోని దేరువాడ, వనకాబడి, జర్న, దిగువచోరుపల్లి, నొంద్రుకోన వంటి గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, నాయకులు శంకరరావు, మోహన్‌రావు, సన్యాసిరావు ఉన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన

పాచిపెంట: పాచిపెంటలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే మొబైల్ వ్యాన్‌ను జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. ఎంతమందికి ఏఏ సరుకులు పంపిణీ చేస్తున్నారని ఆపరేటర్‌కు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందే విధంగా పనిచేయాలంటూ ఆయన ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టిలో పెట్టాలని సూచించారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆయన చేతులమీదుగా న్యూ మోడల్ టెస్ట్ పేపర్లను ఉచితంగా అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపీడీవో పి.లక్ష్మీకాంత్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేయండి

సాలూరు: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ● **మక్కువ:** మక్కువలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, మావుడి రంగునాయుడు, ఎంపీడీవో సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎంఎల్ఎ ఎస్ ప్రసాద్, ఎంపీపీ రమణమ్మ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందాలి

పాలకొండ: ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి ఎన్‌హెచ్ఎం ద్వారా 16 సీసీ కెమెరాలు వచ్చాయని, వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. సివిల్ వర్క్స్ కోసం ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా మూడు కోట్ల రూపాయలకు టెండర్లు పిలిచామన్నారు. రోగుల సౌకర్యార్థం సోలార్ సిస్టం ద్వారా వేడినీరు అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. ఫైర్ లైసెన్స్ కోసం కొన్ని పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉందని, దాని కోసం సుమారుగా రూ.30లక్షలు అవసరం ఉందని తెలిపారు. దీని కోసం కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రాంతీయ ఆసుపత్రి, పాలకొండ సూపరింటెండెంట్ గొర్లె నాగభూషణం, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోండి

- జిల్లా ఉప వైద్యాధికారి భాస్కరరావు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డి.భాస్కరరావు సూచించారు. బీవీ పురంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అత్యవసర కేసులతో పాటు మెరుగైన చికిత్సల కోసం రిఫర్ చేస్తామని చెప్పారు. శిబిరంలో హాజరైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఎముకుల విభాగానికి సంబంధించి మెరుగైన సేవలందిస్తున్న వైద్యుడు సంతోషకు మార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, డా.సంతోషకుమార్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ సాధికారిక జిల్లా అధికారి ఎం.రుక్మాంగదయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైటీసీలో సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 60 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యా సామర్థ్యాలను పెంపొందించే పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏటీడబ్ల్యూవోలు సురేష్‌కుమార్, చంద్రబాబు, జీఎంవలస, కురు పాం, గుమ్మలక్ష్మీపురం సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెల్లిమర్ల: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రం నెల్లిమర్లతో పాటు మండలంలోని కొండగుంపాం, గరికపేట, మొయిదల్లోని పోలింగ్ కేంద్ర భవనాలను పరిశీలించారు. ఎస్ఐ పి.నారాయణరావు, ఏఎస్ఐ కేవీ రమణమూర్తి పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం ఒడిశా


కపిలాష్ కూడలి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఆదివాసీ మహాసంఘ్ నాయకులు

రాయగడ: ఆదివాసీలపై జరుగుతున్న అకృత్యాలకు, హత్యలకు నిరసనగా ఆదివాసీ మహాసంఘ్ తలపెట్టిన జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన బంద్ సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది. బంద్ సందర్భంగా ఉదయం ఆరు గంటలకు స్థానిక కపిలాష్ కూడలి వద్దకు చేరుకున్న ఆదివాసీ మహాసంఘ్ నాయకులు అప్పలస్వామి కద్రక, బసంత ఉలకా తదితరులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న ఆరాచకలను అరికట్టడంతో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, పోలీసులు ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా దోషులను పట్టుకోవాలని, న్యాయం ఓడిపోకుండా చూడాలని కోరారు. భగీరథి మండంగి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. బంద్ కారణంగా బస్సులు, ఆటోలు నిలిచిపోవడంతో ప్రయాణికు లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్తక, వాణిజ్య, విద్యా సంస్థలు మూతపడ్డాయి. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం రాయగడతో పాటు కాశీపూర్, చంద్రపూర్, మునిగుడ, గుణుపూర్ తదితర సమితుల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

వాహనచోదకులకు నేత్ర పరీక్షలు

రాయగడ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గుణుపురంలో బస్సు డ్రైవర్లకు రవాణాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. వాహన చోదకులకు దృష్టి అత్యంత ముఖ్యమని, అందుచే వారికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని రవాణా శాఖాధికారులు తెలిపారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందజేశారు.


డ్రైవర్లకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు